క్లుప్తంగా

అటవీ సంరక్షణకు కృషి



డీఎఫ్‌ఓ శ్యామలకు బొకే అందిస్తున్న జూనియర్ ఫారెస్టు అసోసియేషన్ నాయకులు

కర్నూలు కల్చరల్: ఏపీ జూనియర్ ఫారెస్టు అసోసియేషన్ కర్నూలు యూనిట్ సభ్యులు బుధవారం డీఎఫ్‌ఓ శ్యామల, నంద్యాల డీఎఫ్‌ఓ నాగమనేశ్వరి, ఫ్లయింగ్ స్క్వాడ్ డీఎఫ్‌ఓ సూర్య చంద్రరాజును మర్యాదపూర్వకంగా కలిశారు. అటవీ సంరక్షణకు కృషి చేస్తామని, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి సహకరించాలని కోరారు. అసోసియేషన్ అధ్యక్షుడు కిరణ్‌కుమార్, ఉపాధ్యక్షుడు అబ్దుల్ కలాం, కార్యదర్శి మౌలాలి, ఆర్గనైజింగ్ సెక్రటరీ రతిదేవి, జాయింట్ సెక్రటరీ కాళిదాస్, కోశాధికారి అనురాధ తదితరులు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో గోపూజ



గోపూజ చేస్తున్న సాయి భక్తులు

కర్నూలు కల్చరల్: భగవాన్ శ్రీ సత్యసాయి బాబా జయంతి పురస్కరించుకొని సత్యసాయి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోశాలలో గోపూజ చేసి ఆవులకు గ్రాసం పెట్టారు. సాయి సేవా ట్రస్ట్ జిల్లా అధ్యక్షుడు కృష్ణారెడ్డి, కన్వీనర్ మాకా అశోక్‌కుమార్, మహిళా విభాగం అధ్యక్షులు సరోజ, సభ్యులు పాల్గొన్నారు.

ఫిజిక్స్‌లో డాక్టరేట్



వీసీ ఎన్‌టీకే నాయక్‌తో మద్దిలేటి, గైడ్ కృష్ణారెడ్డి తదితరులు

కర్నూలు కల్చరల్: నంద్యాల జిల్లా పగిడ్యాల మండలం నెహ్రూనగర్‌కు చెందిన జల్లి మద్దిలేటి డాక్టరేట్ అందుకున్నారు. రాయలసీమ విశ్వవిద్యాలయంలో ఫిజిక్స్ విభాగంలో ప్రొఫెసర్ సి.వి.కృష్ణారెడ్డి పర్యవేక్షణలో 'మాదికరణం చేసిన నికెల్–కోబాల్ట్ ఫెర్రైట్' అనే అంశంపై చేసిన పరిశోధనకు గాను బుధవారం పీహెచ్‌డీ ప్రదానం చేశారు. డాక్టరేట్ పొందిన మద్దిలేటిని విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య ఎన్‌టీకే నాయక్, రిజిస్ట్రార్ డాక్టర్ బి.విజయకుమార్‌నాయుడు, రీసెర్చ్ డైరెక్టర్ ఆచార్య విశ్వనాథరెడ్డి అభినందించారు. మద్దిలేటి చేసిన పరిశోధన ట్రాన్స్‌ఫార్మర్ కోర్, సమాచార నిక్షిప్తం, సున్నిత అయస్కాంతాలు, విద్యుత్ నిరోధకాలలో ఉపయోగపడుతుందని ఆచార్య సీవీ కృష్ణారెడ్డి పేర్కొన్నారు.

వక్ఫ్ సవరణను ప్రభుత్వం వ్యతిరేకించాలి



మాట్లాడుతున్న ఎస్‌ఏ సుభాన్

కర్నూలు(సెంట్రల్): వక్ఫ్ బోర్డు సవరణ చట్టానికి వ్యతిరేకంగా అసెంబ్లీలో తీర్మానం చేయాలని ఆవాజ్ రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు ఎస్‌ఏ సుభాన్, జిల్లా అధ్యక్షుడు ముస్తఫా డిమాండ్ చేశారు. బుధవారం నగరంలోని ఆవాజ్ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సీఎం చంద్రబాబునాయుడు ముస్లింలపై చిత్తశుద్ధిని నిరూపించుకునేందుకు కేరళ మాదిరిగా అసెంబ్లీలో వక్ఫ్ చట్టానికి వ్యతిరేకంగా తీర్మానం చేసి కేంద్రానికి పంపాలన్నారు. పార్లమెంట్‌లో వక్ఫ్ సవరణ చట్టం ఆమోదం పొందితే ముస్లింలకు ఇబ్బందులు ఏర్పడతాయన్నారు. రాష్ట్ర కమిటీ సభ్యుడు ఇక్బాల్‌హుస్సేన్, జిల్లా కమిటీ సభ్యుడు ఎస్‌ఎండీ షరీఫ్ పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

కర్నూలు సిటీ: ఆర్టీసీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని పీ.టీ.డీ ఏ.ఏ.పీ.ఎస్.ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో కర్నూలు డిపో–1, డిపో–2 వద్ద ధర్నా నిర్వహించారు. ఆ ఫెడరేషన్ రీజినల్ అధ్యక్షుడు ఎస్.ఆర్.కె రెడ్డి అధ్యక్షతన జరిగిన ధర్నాలో ఫెడరేషన్ జిల్లా గౌరవాధ్యక్షుడు ఎం.డి.అంజిబాబు, రీజినల్ కార్యదర్శి వి.ఎస్ రాయుడు పాల్గొని ప్రసంగించారు. తమ డిమాండ్లనువెంటనే పరిష్కరించాలని కోరారు.

24న బ్రాహ్మణ కార్తీక వనభోజనాలు

కర్నూలు(అర్బన్): పవిత్ర కార్తీక మాసం పురస్కరించుకొని నగర బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 24వ తేదీన కర్నూలు, కల్లూరు నగర బ్రాహ్మణ బంధువుల కార్తీక వనభోజన కార్యక్రమం నిర్వహించనున్నట్లు అధ్యక్షుడు సందేల్ చంద్రశేఖర్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పావన తుంగభద్ర నదీ తీరాన వెలసిన శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయం, భవానీ సమేత రామలింగేశ్వర స్వామి ఆలయంలో కార్తీక మాస వనభోజన మహోత్సవాన్ని ఏర్పాటు చేశామన్నారు. కర్నూలు, కల్లూరు పరిధిలోని ప్రతి బ్రాహ్మణ కుటుంబం పాల్గొని బ్రాహ్మణుల ఐక్యతను చాటాలని కోరారు.

నిర్దేశిత లక్ష్యాలను సాధించాలి

కర్నూలు (సెంట్రల్): యాస్పిరేషనల్ బ్లాక్స్ (హొళగుంద, మద్దికెర, చిప్పగిరి) మండలాల్లో నిర్దేశించిన 40 సూచికలకు సంబంధించిన లక్ష్యాలను డిసెంబర్‌లోపు సాధించాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో యాస్పిరేషనల్ బ్లాక్స్ పురోగతిపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వ్యవసాయ శాఖ, వైద్య, ఆరోగ్య శాఖలు నిర్దేశించిన సూచికల్లో వంద శాతం ప్రగతిని సాధించాయన్నారు. ఐసీడీఎస్‌కు సంబంధించి తీవ్ర పోషకాహార లోపం, మితమైన పోషకాహార లోపం ఉన్న ఐదేళ్లలోపు పిల్లలకు ఏఎస్ఎం, అంగన్‌వాడీ టీచర్లు లేదా ఆయాలు పిల్లల ఇంటికి వెళ్లి ఎలాంటి న్యూట్రిషన్ ఆహారం ఇచ్చారు, బాలామృతం ఇచ్చారా తదితర వివరాలను యాప్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు.



మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్‌బాషా

అంగన్‌వాడీ కేంద్రాల్లో పెండింగ్ ఉన్న టాయ్‌లెట్ల నిర్మాణం, ట్యాప్ కనెక్షన్లను డిసెంబర్‌లోపు పూర్తి చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు సూచించారు. అలాగే జల్‌జీవన్ మిషన్ కింద పెండింగ్‌లో ఉన్న ఇంటింటికీ కుళాయి కనెక్షన్లను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఓడీఎఫ్ ప్లస్ గ్రామాలుగా తీర్చిదిద్దాలన్నారు. హౌసింగ్‌కు సంబంధించి పురోగతి తక్కువగా ఉందని, లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకునే విధంగా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. వంద శాతం ఫైబర్ నెట్ కనెక్షన్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. యాస్పిరేషనల్ బ్లాక్స్ ప్రగతిని పర్యవేక్షించేందుకు యాప్ రూపొందిస్తున్నామని, డిసెంబర్ 1వ తేదీ నాటికి అందుబాటులోకి వస్తుందన్నారు. నిర్దేశించిన 40 సూచికల ప్రగతిని ఈ యాప్‌లో ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని అధికారులకు సూచించారు. ఈ అంశంపై ఫీల్డ్ స్థాయి సిబ్బందికి శిక్షణ ఇవ్వాలని అసిస్టెంట్ కలెక్టర్‌కు సూచించారు. అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, సీపీఓ హిమ ప్రభాకర్ రాజు, ఐసీడీఎస్ పీడీ వెంకటలక్ష్మి, హౌసింగ్ పీడీ చిరంజీవి, యాస్పిరేషనల్ బ్లాక్స్ మండలాల అధికారులు పాల్గొన్నారు.

అధిక ధరలపై చర్యలు తీసుకోవాలి



వినతిపత్రం ఇస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

కర్నూలు(సెంట్రల్): కర్నూలు నగరం, శివారుల్లోని పలు హోటళ్లు, రెస్టారెంట్లలో వాటర్‌బాటిళ్లు, కూల్ డ్రింక్‌లను ఎమ్మార్పీ కంటే అధిక ధరకు విక్రయిస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, నగర కార్యదర్శి బీసన్న డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం లీగల్ మెట్రాలజీ డిప్యూటీ కమిషనర్ చల్లా దయాకర్‌రెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కొన్ని హోటళ్లలో శుభ్రత పాటించడం లేదని, అధిక ధరలకు నాణ్యత లేని ఆహార పదార్థాలను వడ్డిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నాయకులు కృష్ణ, చంటి ఉన్నారు.

సమాజ చైతన్య కేంద్రాలు గ్రంథాలయాలు



బహుమతులు అందుకున్న విద్యార్థులతో అతిథులు

కర్నూలు కల్చరల్: సమాజ చైతన్య కేంద్రాలు గ్రంథాలయాలని రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేష్ అన్నారు. జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఏడో రోజు బుధవారం ముగింపు వేడుకలు జరిగాయి. ముందుగా సరస్వతీదేవి చిత్రపటానికి పూలమాలలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా టీజీ మాట్లాడుతూ.. విద్యార్థులు, యువత, భావితరానికి విజ్ఞానాన్ని అందించేందుకు గ్రంథాలయాలు ఉపయుక్తంగా నిలుస్తున్నాయన్నారు. గ్రంథాలయం అభివృద్ధికి సహకరిస్తానన్నారు. స్టడీ ల్యాబ్‌కు ఏసీతో పాటు ఇతర సౌకర్యాలు కల్పిస్తానని హామీఇచ్చారు. అనంతరం వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు అలరించాయి. జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థ సెక్రటరీ కె.ప్రకాష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్లు చంద్రశేఖర కల్కూర, కేజీ గోవిందరెడ్డి, డిప్యూటీ సెక్రటరీ పెద్దక్క, కేవీ సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞానం పెంచుకోవాలి

కర్నూలు సిటీ: క్లస్టర్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో బుధవారం సిల్వర్‌జూబ్లీ డిగ్రీ కాలేజీలో ప్రిన్సిపాల్ డాక్టర్ వి.వి.ఎస్ కుమార్ అధ్యక్షతన నిర్వహించిన గ్రంథాలయ వారోత్సవాల ముగింపు వేడుకల్లో వర్సిటీ వీసీ ఆచార్య డీవీఆర్ సాయిగోపాల్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. విద్యార్థులు గ్రంథాలయాల్లోని వార్తాపత్రికలు, వార, మాస పత్రికలను రెగ్యులర్‌గా చదువుతూ జ్ఞానాన్ని పెంచుకోవాలన్నారు. త్వరలోనే ఈ–లైబ్రరీలను అనుబంధ కాలేజీల్లో ప్రారంభిస్తామన్నారు. రిజిస్ట్రార్ డాక్టర్ కట్టా వెంకటేశ్వర్లు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రసాద్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

టీకాతో ప్రాణాంతక వ్యాధుల నుంచి రక్షణ



అవగాహన కల్పిస్తున్న డెమో శ్రీనివాసులు

కర్నూలు(హాస్పిటల్): చిన్నారులు, గర్భిణులకు టీకాలు వేయడం వల్ల ప్రాణాంతక వ్యాధుల నుంచి రక్షణ లభిస్తుందని డెమో శ్రీనివాసులు శెట్టి చెప్పారు. బుధవారం స్థానిక ముజఫర్‌నగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని 82వ సచివాలయంలో గర్భిణులు, బాలింతలకు వ్యాధినిరోధక టీకాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డెమో శ్రీనివాసులు మాట్లాడుతూ.. తల్లులు, పిల్లలకు నిర్దేశించిన ప్రకారం టీకాలు వేయిస్తే వ్యాధి నిరోధక శక్తి పెరిగి ఎలాంటి వైరస్‌లకు గురిగాకుండా ఆరోగ్యంగా ఉంటారని చెప్పారు. మీజిల్స్ రుబెల్లా వ్యాధి రాకుండా 9 - 12 నెలల వయస్సులో చిన్నారులకు మొదటి డోసు, 16 నుంచి 24 నెలల వయస్సు వారికి రెండో డోసు తప్పనిసరిగా ఇవ్వాలని సూచించారు. షెడ్యూల్ ప్రకారం 5, 10, 16 సంవత్సరాల వయస్సుల వారీగా ఇచ్చిన అన్ని రకాల వ్యాక్సినేషన్లను నమోదు చేయాలని, గర్భిణులకు రెండు టీడీ డోసు వ్యాక్సిన్‌తో పాటు ఐరన్ మాత్రలు ఇవ్వాలని సూచించారు. ఆరోగ్య విద్యాబోధకురాలు పద్మావతి, సచివాలయ ఆరోగ్య కార్యకర్త స్వర్ణలత, ఆశా కార్యకర్తలు సునీత, రాఘవేంద్ర, ప్రాజెక్టనిస్టు ఖలీల్ పాల్గొన్నారు.

రైతులకు పెట్టుబడి సాయం వెంటనే ఇవ్వాలి



ధర్నా చేస్తున్న ఏపీ రైతు సంఘం నాయకులు

కర్నూలు(సెంట్రల్): కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు.. రైతులకు తక్షణమే రూ.20 వేల పెట్టుబడి సాయం అందించాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.జగన్నాథం డిమాండ్ చేశారు. బుధవారం కలెక్టరేట్ ఎదుట ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు అప్పులు చేసి పంటలు పండిస్తున్నారని, వారిని ఆదుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం ముందుకు రావాలన్నారు. ఈ ఏడాది అధిక వర్షాలతో రైతులు తీవ్రంగా నష్టపోయారని, పంటలు నష్టపోయిన వారికి వెంటనే ఇన్‌పుట్ సబ్సిడీని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కర్నూలులో రైతులు పండించిన ఉల్లి పంటను ప్రభుత్వం కొనుగోలు చేయలేకపోవడం అన్యాయమన్నారు. నాయకులు సురేంద్రయాదవ్, తిమ్మయ్య హాజరయ్యా

రజకులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి



మాట్లాడుతున్న భాస్కరయ్య

కర్నూలు(సెంట్రల్): కూటమి ప్రభుత్వం రజకులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఏపీ రజక వృత్తిదారుల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మన్నూరు భాస్కరయ్య డిమాండ్ చేశారు. బుధవారం కేకే భవన్‌లోని వీరనారి చాకలి ఐలమ్మ కార్యాలయంలో రజక వృత్తిదారుల సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశం ముక్కన్న అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రజకులకు 50 ఏళ్లకే పెన్షన్ ఇస్తామని చెప్పిన హామీని సీఎం చంద్రబాబు నిలబెట్టుకోవాలన్నారు. ఇస్త్రీ షాపులు, దోబీఘాట్ల నిర్వహణకు 200 యూనిట్ల వరకు ఉచిత కరెంట్ ఇవ్వాలని, రజక వృత్తిదారులకు అండగా రక్షణ చట్టం తేవాలని, రజక కార్పొరేషన్ ద్వారా రూ.2000 కోట్ల రుణాలు ఇవ్వాలని కోరారు. అలాగే అపార్టుమెంట్లు, ఇస్త్రీదారులకు కనీస వేతనం అమలు చేయాలన్నారు. జిల్లా అధ్యక్షుడు గురుశేఖర్, సీహెచ్ శ్రీనివాసులు, జయమ్మ, శేషాద్రి పాల్గొన్నారు.

వేళకు విద్యార్థి బస్సు నడపాలి



ఆర్టీసీ డిపో-2 అసిస్టెంట్ మేనేజర్ దీప్తికి వినతిపత్రం ఇస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

కర్నూలు సిటీ: గూడురు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 200 మందికిపైగా విద్యార్థులు రోజూ జూలకల్లు గ్రామంలోని ఏపీ మోడల్ స్కూల్‌కు రాకపోకలు సాగిస్తున్నారని, వారి సౌకర్యార్థం స్కూల్ సమయానికి విద్యార్థి బస్సు నడపాలని ఎస్ఎఫ్ఐ నాయకులు బుధవారం ఆర్టీసీ డిపో–2 అసిస్టెంట్ మేనేజర్ దీప్తికి వినతిపత్రం ఇచ్చారు. ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రంగప్ప, అబ్దుల్లా మాట్లాడుతూ.. ఏపీ మోడల్ స్కూల్‌కు నాగలాపురం పెంచికలపాడు, గుడిపాడు, బూడిదపాడు, గూడురు, పొన్నకల్లు, మునగాల, మల్లాపురం, చనుగండ్ల గ్రామాల నుంచి విద్యార్థులు వస్తుంటారని, బడికి వేళకు చేరుకునేందుకు బస్సులు అందుబాటులో లేవన్నారు. దీంతో ప్రైవేటు వాహనాల్లో వెళ్లాల్సిన పరిస్థితులు ఉన్నాయన్నారు. ఆర్టీసీ అధికారులు స్పందించి వేళకు బస్సు నడపడంతో పాటు, గూడూరు ప్రభుత్వ జూనియర్ కాలేజీ వద్ద స్టాపింగ్ ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఆ సంఘం నాయకులు ఖాజా, సాయి ఉదయ్, తదితరులు ఉన్నారు.

వార్డు రెవెన్యూ కార్యదర్శి నిర్లక్ష్యం

కర్నూలు (టౌన్): సచివాలయంలో పనిచేసే ఓ వార్డు రెవెన్యూ కార్యదర్శి విధుల పట్ల నిర్లక్ష్యం, డ్యూటీకి సకాలంలో రాకపోవడం వంటి ఫిర్యాదుల నేపథ్యంలో నగరపాలక కమిషనర్ ఎస్.రవీంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. నగరపాలక సంస్థ పరిధిలోని గురురాఘవేంద్ర నగర్‌కు చెందిన 92వ సచివాలయం వార్డు రెవెన్యూ కార్యదర్శి టి.శివప్రసాద్‌పై జాబ్‌చార్ట్ పాటించకపోవడం, జియో లొకేషన్ ట్యాగింగ్, పెన్షన్స్, స్కిల్ సర్వే, రిజిస్టర్‌లో సంతకాలు చేయకపోవడం, అధికారులకు నిర్లక్ష్యంగా సమాధానం ఇవ్వడం తదితర ఫిర్యాదులు వచ్చాయి. దీనిపై స్పందించిన కమిషనర్ రెవెన్యూ అధికారి జునీద్‌ను విచారణ అధికారిగా నియమించారు. సదరు ఉద్యోగి పనితీరుపై పూర్తిస్థాయిలో విచారించి మూడు రోజుల్లో నివేదిక సమర్పించాలని ఆదేశాలు జారీ చేశారు.

స్క్వాడ్ బృందం తనిఖీలు

కర్నూలు (సిటీ): ఈనెల 17వ తేదీ నుంచి జరుగుతున్న ఆచార్య నాగార్జున యూనివర్సిటీ దూర విద్య పరీక్ష కేంద్రాలను బుధవారం స్క్వాడ్ బృందం రాయలసీమ జిల్లాల్లోని కేంద్రాలన్నింటిలో విస్తృతంగా తనిఖీలు నిర్వహించింది. కర్నూలు నగరంలోని కేంద్రాల్లో నిబంధనలకు అనుగుణంగానే పరీక్షలు జరుగుతున్నట్లు బృందం నిర్ధారించింది. ఆయా కేంద్రాల నిర్వాహకులకు పలు సూచనలు చేసింది. అయితే స్క్వాడ్ నిర్వహించే తనిఖీలపై సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారం అవాస్తవమని ఆయా కళాశాలల యాజమాన్యాలు వర్సిటీ అధికారులకు రాతపూర్వకంగా తెలియజేశారు.

రైల్వే పోలీస్‌స్టేషన్ తనిఖీ

కర్నూలు (టౌన్): కర్నూలులోని రైల్వే పోలీస్‌స్టేషన్‌ను బుధవారం గుంతకల్ రైల్వే ఇన్‌చార్జ్ డీఎస్పీ హర్షిత ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌లో రికార్డులను పరిశీలించారు. పోలీసులకు పలు సూచనలు చేశారు. రైళ్లలో దొంగతనాలు, మహిళలపై నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రైల్వే పోలీస్ సర్కిల్ సీఐ శ్రీనాథ్ రెడ్డి ఉన్నారు.

తప్పిపోయిన పిల్లలు తల్లిదండ్రుల చెంతకు..

కర్నూలు (టౌన్): తప్పిపోయిన పిల్లలను ఒకటవ పట్టణ పోలీసులు తల్లిదండ్రుల చెంతకు చేర్చారు. బుధవారం జొహరాపురంలో శ్రీరాముల వారి విగ్రహావిష్కరణ, ధ్వజస్తంభం ప్రతిష్ట కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని చూసేందుకు నంద్యాల జిల్లా సీతారామాపురం గ్రామానికి చెందిన శాంతి జొహరాపురంలోని బంధువుల ఇంటికి వచ్చారు. కుటుంబ సభ్యులతో కలసి ధ్వజస్తంభ కార్యక్రమానికి హాజరయ్యారు. ఆ సమయంలో వారి పిల్లలు బాబు, పాప తప్పిపోయారు. ఆందోళనకు గురైన తల్లిదండ్రులు పోలీసులను ఆశ్రయించి మైక్‌లో అనౌన్స్ చేసినా ఆచూకీ తెలియలేదు. విధుల్లో ఉన్న హెడ్‌కానిస్టేబుల్ రఫి పిల్లలను గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించారు. పిల్లలను అప్పగించిన పోలీసులకు వారు కృతజ్ఞతలు తెలియజేశారు.

కిశోర బాలికలు పోషకాహారం తీసుకోవాలి

కర్నూలు (సిటీ): బాలల పరిరక్షణ జిల్లా విభాగం ఆధ్వర్యంలో ఎస్‌ఏపీ క్యాంప్‌లోని కట్టమంచి రామలింగారెడ్డి మున్సిపల్ మెమోరియల్ హైస్కూల్‌లో బాలల హక్కుల వారోత్సవాల ముగింపు కార్యక్రమం నిర్వహించారు ఏపీఎస్పీ రెండవ బెటాలియన్ డీఎస్పీ మహబూబ్ బాషా, స్త్రీ శిశు సంక్షేమ శాఖ అర్బన్ సీడీపీఓ అనురాధ, బాలల పరిరక్షణ జిల్లా విభాగం అధికారి టి.శారద పాల్గొని ప్రసంగించారు. బాలలు నైతిక విలువలు, బాధ్యతలు గుర్తించి నడుచుకోవాలన్నారు. కిశోర బాలికలు పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవడం వల్ల వ్యాధి నిరోధక శక్తి పెరగడంతో పాటు రక్తహీనత, తదితర వ్యాధుల నుంచి రక్షించుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు. వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. హెచ్ఎం వెంకటరెడ్డి, బాలల పరిరక్షణ విభాగం సిబ్బంది పద్మ, దీపారాణి, శ్రీలక్ష్మి, నరసింహులు, గీతావాణి, నాగేశ్వరరావు, శ్వేత, కీర్తి, రంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

బేస్‌బాల్ పోటీల్లో సత్తా చాటాలి



క్రీడాకారులను అభినందిస్తున్న డీవీఈఓ పరమేశ్వర రెడ్డి

కర్నూలు (టౌన్): త్వరలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీల్లో కర్నూలు క్రీడాకారులు ప్రతిభ చాటి విజేతలుగా నిలవాలని జిల్లా వృత్తి విద్యాశాఖాధికారి పరమేశ్వర రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి బేస్‌బాల్ ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా డీవీఈఓ మాట్లాడుతూ విద్యార్థినీ, విద్యార్థులు క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి హర్షవర్ధన్ మాట్లాడుతూ.. ఎంపిక పోటీల్లో ప్రతిభ చాటిన క్రీడాకారులు రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీల్లో పాల్గొంటారన్నారు. బేస్‌బాల్ సంఘం కార్యదర్శి సుబ్బయ్య, అధ్యక్షుడు రమణయ్య, వ్యాయామ ఉపాధ్యాయులు కల్యాణి, మాధవి, బుచ్చిబాబు పాల్గొన్నారు.

అధిక సాంద్రత పత్తి సాగు లాభదాయకం



సమావేశంలో మాట్లాడుతున్న సుజాత

కల్లూరు: అధిక సాంద్రత పత్తి సాగు రైతులకు లాభదాయకమని కర్నూలు డాట్ సెంటర్ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సుజాత తెలిపారు. బుధవారం కల్లూరు మండలం ఎ.గోకులపాడు గ్రామంలో రిలయన్స్ ఫౌండేషన్, అపార్డ్ స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు రైతు క్షేత్ర దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సుజాత మాట్లాడుతూ అధిక సాంద్రత పద్ధతిలో పత్తి సాగుతో పెట్టుబడి ఖర్చులు తగ్గుతాయన్నారు. భారత రైతు సమాఖ్య సంఘాల మాజీ ప్రధాన కార్యదర్శి బొజ్జా దశరథరామిరెడ్డి మాట్లాడుతూ సులభతరంగా రైతులకు ఆదాయన్నిచ్చే అధిక సాంద్రత పద్ధతులను రైతులకు చేరువ చేయాలన్నారు. ఇందుకు అవసరమైన విత్తనాలను రైతులకు అందుబాటులో ఉంచాలని సూచించారు. కేవీకే బనవాసి కేంద్ర ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ రాఘవేంద్ర మాట్లాడుతూ ఈ విధమైన వ్యవసాయ పద్ధతిలో ఎకరాలో దాదాపు 29,000 మొక్కలను పెంచవచ్చన్నారు. అధిక సాంద్రత పద్ధతిలో సాగు చేసిన పత్తి పైరును అధికారులు పరిశీలించారు. కార్యక్రమంలో అపార్డు సంస్థ అధినేత తిరుపతిరెడ్డి, రిలయన్స్ ఫౌండేషన్ జిల్లా ప్రాజెక్ట్ ఆఫీసర్ సర్వేశ్వరరెడ్డి, డీపీఎమ్ కుమార స్వామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యం లోపించకుండా చర్యలు



జొహరాపురంలో సమస్యలు తెలుసుకుంటున్న కమిషనర్ రవీంద్రబాబు

కర్నూలు (టౌన్): ఎక్కడికక్కడ మురుగు నిలిచిపోకుండా వెంటనే తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని నగరపాలక కమిషనర్ ఎస్.రవీంద్రబాబు ఆదేశించారు. బుధవారం స్థానిక జొహరాపురం జమ్మిచెట్టు, రాధా, రేణుకా నగర్, రిచ్మండ్ కాలనీ, వీకర్ సెక్షన్ కాలనీలో మున్సిపల్ ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ విశ్వేశ్వర రెడ్డితో కలిసి పర్యటించారు. స్థానిక కాలనీవాసులతో మాట్లాడారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ప్రతి రోజు పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించాలని, లేనిపక్షంలో చర్యలు తీసుకుంటామన్నారు. ఆక్రమణలు తొలగించాలని ఆదేశించారు. డీఈఈ గిరి రాజు, అంజాద్‌బాషా, ఏఈ ప్రవీణ్ పాల్గొన్నారు.

విధుల్లో, క్రీడల్లో రాణించడం శుభపరిణామం



విజేతలకు మెడల్స్, షీల్డ్‌లను బహుకరిస్తున్న ఏపీఎస్పీ కమాండెంట్ ప్రభుకుమార్

కర్నూలు (టౌన్): పటాలపు సిబ్బంది విధుల్లో, క్రీడల్లో రాణించడం శుభపరిణామమని నగరపాలక కమిషనర్ రవీంద్రబాబు అన్నారు. బుధవారం స్థానిక ఏపీఎస్పీ పటాలపు క్రీడా మైదానంలో 7వ యాన్యువల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ క్రీడల ముగింపు కార్యక్రమంలో కమిషనర్ పాల్గొన్నారు. కమిషనర్ మాట్లాడుతూ.. ఇటీవల విజయవాడ వరదల్లో 2వ పటాలపు పోలీసుల చక్కని సేవలు అందించి హోం మంత్రిచే ప్రశంసలు పొందారని గుర్తు చేశారు. 2వ పటాలపు కమాండెంట్ ప్రభుకుమార్ మాట్లాడుతూ.. సిబ్బందికి ఒత్తిడిని తగ్గించే ఉద్దేశంతో క్రీడలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పటాలపు అదనపు దళాధిపతి నాగేంద్రరావు, సహాయ దళాధిపతి మహబూబ్‌బాషా, డీఎస్పీలు సుధాకర్‌రెడ్డి, శర్ఫుద్దీన్, వెంకటరమణ పాల్గొన్నారు.

విజేతల వివరాలు: టెన్నిస్‌లో ప్రభుకుమార్, మహబూబ్‌బాష (విన్నర్స్), పి.రవికిరణ్, రాజు (రన్నర్స్)గా నిలిచారు. అలాగే వాలీబాల్, క్రికెట్, టగ్–ఆఫ్–వార్ పోటీల్లో పోలీసులు ప్రతిభ చాటారు. వీరికి మెడల్స్, షీల్డ్‌లను బహుకరించారు.

విజేతలకు బహుమతుల ప్రదానం



విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.కబర్ధి

కర్నూలు (లీగల్): జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లా న్యాయ సేవా సదన్‌లో బుధవారం అంతర్జాతీయ బాలల దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.కబర్ధి హాజరయ్యారు. బాలల దినోత్సవ వారోత్సవాలను పురస్కరించుకుని ఈ నెల 16వ తేదీన వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు జి.కబర్ధి, కార్యదర్శి బి.లీలా వెంకటశేషాద్రి, లోక్ అదాలత్ అధ్యక్షుడు వెంకటహరినాథ్, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సభ్యుడు ఎస్.మనోహర్, డిప్యూటీ డీఈఓ హనుమంతరావు చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ప్రథమ బహుమతి సాయి లిఖిత, ద్వితీయ బహుమతి సుహృతి (ఏపీజే అబ్దుల్ కలాం హైస్కూల్), తృతీయ బహుమతి నిర్మల జ్యోతి (ఇందిరాగాంధీ మున్సిపల్ హైస్కూల్) అందుకున్నారు. పలువురికి ప్రోత్సాహక బహుమతులు, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చిత్ర పటాలపై అవగాహన

కల్లూరు: ఉపాధి హామీ పథకం పనుల గుర్తింపు ప్రణాళికలో భాగంగా సామాజిక చిత్రపటాల గురించి ఏపీఓ మద్దేశ్వరమ్మ బుధవారం కె.మార్కాపురం, పర్ల గ్రామ పంచాయతీలలో ప్రజలకు అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా సామాజిక చిత్ర పటం, గ్రామాల్లోని వనరుల మ్యాప్, సీజనల్ మ్యాప్‌లను ముగ్గు వేసి వివరించారు. అలాగే సల్కాపురం గ్రామంలో నూతనంగా నిర్మించనున్న సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ (ఎస్‌డబ్ల్యూపీసీ)కు మార్కింగ్ పనులను పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్ మద్దిలేటి, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి పనులు కల్పించండి

కల్లూరు: ఉపాధి కూలీలకు అడిగిన వెంటనే పనులు కల్పించాలని ఎంపీడీఓ నాగశేషాచలరెడ్డి తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో బుధవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఎంపీడీఓ మాట్లాడారు. ఉపాధి సిబ్బందికి, ఫీల్డ్ అసిస్టెంట్లకు ఇచ్చిన టార్గెట్‌ను చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో పీఎల్ఆర్‌సీ కోర్సు డైరెక్టర్ ఎర్రమల, ఏపీఓ మద్దేశ్వరమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

ఎర్రమట్టిని తరలిస్తే చర్యలు

సి.బెళగల్: ఎర్రమట్టిని అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు ఉంటాయని ఎస్ఐ తిమ్మారెడ్డి హెచ్చరించారు. బుధవారం ఉదయం పోలీస్ సిబ్బందితో మండలంలోని గ్రామాలలో ఎస్ఐ గస్తీ నిర్వహించారు. సి.బెళగల్ కొండ నుంచి ఎర్రమట్టిని అక్రమంగా తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, ట్రాక్టర్లను రెవెన్యూ అధికారులకు అప్పగిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఎర్రమట్టిని అక్రమంగా తరలించే వారిపై ప్రజలు సమాచారం ఇవ్వాలని, వివరాలను గోప్యంగా ఉంచుతామని ఎస్ఐ తెలిపారు.

ఆక్రమణలు తొలగించాలి



ఇన్‌చార్జ్ మేనేజర్ స్వర్ణలతకు వినతిపత్రం ఇస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

కర్నూలు (టౌన్): నిత్యం రద్దీగా ఉండే సి.క్యాంపు బస్‌స్టాప్ వద్ద రాత్రికి రాత్రి ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించుకొని షాపులు ఏర్పాటుచేశారని, ప్రయాణికులకు, వాహనదారులకు ఇబ్బందిగా మారిన షాపులను తొలగించాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక నగరపాలక కార్యాలయంలో ఇన్‌చార్జ్ మేనేజర్ స్వర్ణలతను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటికే ట్రాఫిక్‌తో ఇబ్బందులు పడుతుంటే ఆ ప్రాంతంలో 6 షాపులు ఏర్పాటు చేశారన్నారు. ప్రభుత్వ స్థలంలో షాపులు వేసిన వారు వేలాది రూపాయలు తీసుకొని వ్యాపారులకు బాడుగకు ఇస్తున్నారన్నారు. మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడం వెనుక అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నారు. అక్రమంగా ఏర్పాటు చేసిన దుకాణాలను తొలగించాలని లేనిపక్షంలో ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో స్థానిక ప్రజలను ఏకం చేసి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని స్పష్టం చేశారు. ఆ సంఘం నాయకులు చంటికుమార్, బీసన్న, లాజర్ తదితరులు పాల్గొన్నారు.